కథానిక

మనిషి చెట్టు!

30/10/87



ఉపద్రష్టా రాయి

ఇప్పుడు ఆ చెట్టు కాయడం లేదు. యాభై సంవత్సరాల బట్టీ విపరీతంగా లెక్క లేనన్ని కాయలను కాచిన ఆ చెట్టు ఇప్పుడు కాయడం లేదు. కనీసం పువ్వులు కానీ కొత్త చిగుర్లు కానీ తొడగడం లేదు. అలాగని ఆ చెట్టు వల్ల ఏ ఉపయోగమూ లేదా అని అడిగితే వుందని చెప్పాలి. కాయలివ్వక పోవచ్చు. పువ్వులు తొడక్క పోవచ్చు. కానీ ఇంచుమించు రెండు వందల చదరపు అడుగుల విస్తీర్ణానికి పెరిగిన ఆ చెట్టు ఎంతో చల్లని నీడను ఇస్తుంది. ముఖ్యంగా వేసవి కాలంలో ఆ చెట్టు నీడలో మంచం వేసుకుని పడుక్కుంటే చాలు. ఎయిర్ కండిషన్డ్ గదుల కన్నా చల్లని గాలిశరీరానికి జోల పాడుతుంది. ఒకవైపు గాలి మరోవైపు ఎంతో శ్రావ్యమైన కోయిల గానం. ఆ చెట్టు పూతకు వచ్చిన మరుక్షణం ఎక్కడి నుంచో వచ్చి వాలుతాయి కోయిలలు. మిట్టమధ్యాహ్నం వేళలలో నిప్పులు చెరుగుతున్న ఎండ ధాటిని తుట్టుకోలేక ఆ చెట్టు క్రిందికి చేరేవారు, చాలా మంది. ఏ రెండు మూడు గంటలో అద మరిచి సేద దీర్చుకుని లేచే సరికి, సూర్యుడు మెల్లగా పడమటి దిక్కువైపు కదిలేవాడు.

ఎన్నో వేసవులనుచవి మాసిన ఆచెట్టును, యాభై సంవత్సరాల బట్టీ ఎందరినో తన ఫలాలతో తృప్తి పరిచిన ఆ చెట్టును మరి కొన్ని గంటలలో నరికి వేస్తారని తెలుసుకున్న గజపతి గారికి నోటమాట రాలేదు. ఆ చెట్టు తన గుమ్మంలో వుంది. అది తన చెట్టు. తన పదవ ఏట ఆ చెట్టును తనే తెచ్చి పాతి పెట్టాడు. బాల్యంలో ఆ చెట్టును ప్రతిరోజు సరంక్షించాడు. తనకు పెళ్ళైయ్యే సరికి ఆ చెట్టు కాయడం మొదలు పెట్టి మూడు సంవత్సరాలైంది. కోనసీమలో వేసవి సెలవులకు వెళ్ళి తెచ్చిన ఆ చెట్టు తనను మోసం చెయ్యలేదు. బంగినపల్లి మామిడి పళ్ళు తన గుమ్మంలో తన స్వంత చెట్టులో వేలాడుతుంటే పడక్కుర్చీలో కూర్చుని వాటికేసి దీక్షగా చూసి మురిసిపోయేవాడు తను. తన పిల్లలు వాళ్ళ పెళ్ళిళ్ళయ్యే వరకు, ఆ తర్వాత మనవళ్ళు మనవరాళ్ళు ఆ చెట్టు ఫలాలను రుచి చూసి మురిసిపోయిన వాళ్ళే.

మరిప్పుడు ఆచెట్టును ఎందుకు కొట్టేస్తున్నారు. తనతో ఎందుకు ఒక్కమాట కూడా చెప్పలేదు. ఈ ఇంట్లో అరవై సంవత్సరాలు తనతో బాటు పెరిగిన చెట్టును కొట్టడానికి ముందు ఆ చెట్టును పెట్టిన తనకు నిర్లక్ష్యం చేయడమెందుకు. ఇప్పుడు కూడా కట్టెల కొట్టు కుర్రాడు వచ్చి చెట్టెప్పుడు కొట్టేస్తారని అడక్క పోతే తనకు తెలిసి వుండేది కాదు.

ఈ ఆలోచన రాగానే గజపతికి చెమట పట్టింది. మెల్లగా, నెమ్మదిగా ఆలోచించారు. మొదట్లో వచ్చిన కోపం, ఆవేశం తగ్గింది. ఆయనకు ఒక సత్యం తెలిసింది. అవును... తనకూ... ఆ చెట్టుకూ తేడా ఏమిటి?

అది ఫలాలిచ్చి ఆగిన చెట్టు...
తను సంపాదించి ఆగిన మనిషి ...
ఆ చెట్టు కాయదు ....
ఈ మనిషి... మరి సంపాదించడు.
ఆ చెట్టు నీడ మాత్రమే ఇస్తుంది.
ఈ మనిషి... ఖర్చు మాత్రమే పెట్టిస్తాడు
తనకూ... ఆ చెట్టుకీ తేడా లేదు.
తను మనిషి...అది మాను...
అనుభూతులు
మాత్రం ఒక్కటే. దాన్ని కొట్టేస్తారు... తనను... కొట్టలేక వదిలేస్తారు.

కొడుకు రంగనాథ్ వస్తే అతనితో చెట్టు గురించి అడగాలనుకుంటూ వుండగానే 'అంబా' అనే అరుపు వినిపించింది, గజపతి గారికి. పడక్కుర్చీలోంచి తలత్రిప్పి చూశాడు. ఎదురింట్లో నుంచి లక్ష్మిని ఎవరో తోలుకు పోతున్నారు. లక్ష్మి ఎవరో కాదు. లింగమూర్తి గారింట్లో గత పది సంవత్సరాలనుంచీ కామధేనువులా ఎందరికో తన తియ్యని పాలను పంచి పెట్టిన గోమాత. ఆ తోలుకు పోతున్న వ్యక్తులను... వాళ్ళ వాలకాన్ని చూస్తే లక్ష్మిని కసాయి షాపుకు తీసుకుపోతున్నారని అనుమానం వేసింది గజపతి గారికి. ఆ ఆవు కళ్ళమ్మట నీళ్ళుకారుతున్నాయి. దీనంగా చూస్తోంది. ఆ చూపుల్లో "ఇనాళ్ళు మీ కుటుంబాని కోసం నా రుధిరాన్ని పంచి పెట్టానే ఆ సేవకు ఇదేనా మీ రిచ్చే ప్రతిఫలం..." అనే మాటలు వినిపిస్తున్నాయి.

ఎవరో లింగమూర్తి నడిగితే "ఆ... ఏం చెయ్యడం. పాలివ్వడం మానేసి రెండు నెలలైంది. ఎంత కాలం మేపడం. అందుకే అమ్మేశాను..." అన్నాడు ఆయన.

చూస్తుండగానే తన కళ్ళ ముందరే ఆ ఆవును తీసుకు వెళ్ళిపోతున్నాడు.

తన జబ్బు పడినప్పుడు లింగమూర్తి గారింట్లోంచి పాలు తెచ్చేది జానకి... పాపం ఆ... ఆవు... రేపీపాటికి మరి ఊహించుకోలేక పోయాడు గజపతి.

ఆలోచనల్లోంచి తేరుకునే లోగ మామిడి చెట్టు కొట్టేయడానికి మనుషులు వచ్చారు. కొందరి చేతుల్లో అంపాలు, మరి కొందరి చేతుల్లో గొడ్డళ్ళు వున్నాయి.

ఆ చెట్టు వల్ల లాభం లేదన్న మాట... వ్యాపార పరమైన మాట. జీవితాలను లాభ నష్టాలతో పోల్చి, జీవితాన్ని కూడా ఒక వ్యాపారంగా తీసుకునే వారు అదే మాట. జీవితంలో అల్లుకుపోయిన మమకారాలు, జీవం వున్న ప్రతి వస్తువులోను వుంటూ జీవితాంతం వెంటాడుతూ వుంటాయి.

ఇంతలో ఇంట్లోకి వచ్చిన కొడుకును అడిగాడు చెట్టును ఎందుకొట్టేస్తున్నారని. రంగనాథ్ ఎంతో నెమ్మదిగా చెప్పాడు. "ఈ చెట్టు వల్ల లాభం లేదు. కాయలు ఫలాలు ఇవ్వడం లేదు. ముసలిదై పోయింది. కేవలం నీడ కోసం ఇంత స్థలం వృధా చేయడం ఎందుకని కొట్టేయ మన్నాను. రెండు వేలిస్తానన్నాడు రాఘవయ్య. బ్యాంకిలో వేసినా రెండు మూడు వందలు వడ్డీ వస్తుంది. అంతే కాక ఆ చెట్టు నీడ పడితే మరే చెట్టు... పెరగడం లేదు కూడా. అందువల్ల అన్నీ ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాను... నీతో చెబితే నీకు నచ్చదు... అంత మాత్రాన పనికి రాని వస్తువునీ... మొక్కలనీ... మానుల్నీ వుంచుకుని ఏం చేస్తాం..." అని ఇంకా ఏవో చెబుతున్నాడు రంగనాథ్. ఆ మాటలు తనకు వినిపించలేదు.

మరి కొద్ది సేపట్లో తను చూస్తుండగానే ఆ చెట్టు శరీరానికి తూట్లు పడుతున్నాయి. కొండంత చెట్టు మెల్లగా ఒరిగిపోతోంది. అరవై సంవత్సరాల చరిత్ర మాసిపోతూంది. ఛ... ఛ... ఈ మమకారాలు పెంచుకోవడం వల్లే కదా మనిషికి బాధలు... కన్నీళ్ళు వర్షించిన కళ్ళు తుడుచుకుంటున్నాడు గజపతి.

మరి చిగురించని చెట్టు...

ఒట్టిపోయిన ఆవు... వీటికన్నా మనిషి ...వృద్ధాప్యం ఆవహించిన మనిషి ఏ రకంగా గొప్ప... మనిషి కూడా వాటి కోవకే చెందిన వాడు.

కాకపోతే... మనిషి వీలునామా రాయగలడు. డబ్బు ఎంతో కొంత వుంటే... వాటిని పిల్లలకు పంచి పెట్టగలడు. మాను ఆ పని చేయ్యలేదు...

అలా పంచిపెట్టడానికి లేని తండ్రికీ మామిడి చెట్టుకీ... లక్ష్మికీ తేడా లేదు...

సాధింపుల రంపపు పోట్లు... వేధింపుల గొడ్డలి పోట్లు... లేకుండా చూసుకునే కొడుకులు ఎక్కడో... వుంటారు... అలాంటి కొడుకులకు తండ్రులుగా వుండే భాగ్యం... ఎందరికి వుంది...

ముసలితనం... మనిషికే కాదు... నోరు లేనిమూగ జీవులకు... మానుకీ... మాకుకీ కూడావుంది. వాటిని ... కూడా... మనిషి మానవత్వంతో చూస్తే... ఆ మానవత్వం కొత్త చిగుళ్ళు తొడుగుతాయి.

మీరు అసూయా పరులా?

అసూయ ముందు పుట్టి తర్వాత ఆడది పుట్టిందని నానుడి! ఆ విషయం అలా వుంచితే అ భద్రతా భావం వల్లే అసూయ జనిస్తుందని కొంత మంది అంటే, ఒక వ్యక్తి మీదున్న విపరీతమైన ప్రేమ భావనకు అసూయ సూచకమని మరి కొంత మంది అంటారు. వివిధ రకాల వ్యక్తుల మనస్తత్వాలను అధ్యయనం చేసి విశ్లేషించిన ఒక అమెరికన్ సైకాలజిస్ట్ ఇద్దరి వ్యక్తులమధ్య ప్రేమానురాగాలు పెరిగితే అవి అసూయగా మారతాయని వెల్లడించాడు.

మరి మీరు కూడా అసూయ పరులా? మిగతా వారందరిలా మీలో అప్పుడప్పుడు అసూయా భావం తలెత్తుతుందా? ఆ విషయం అవునో కాదో తేల్చుకోవడానికి ఈ క్రింది ప్రశ్నలను మీకు అన్వయించుకుని వాటికి తగిన సమాధానాలు ఒక కాగితం మీద రాసి వుంచుకోండి. తద్వారా ప్రశ్నల వివరన ఇచ్చిన సమాధానలతో మీ సమాధానాలతో సరిపోల్చి చూడండి. ఇలా చేయడం వల్ల మీలో అసూయ ఎంత పాళ్లలో వుందో అది ఇతరులకు ప్రమాదకారి అవునో కాదో తెలుస్తుంది.

1. అమల, విజయ్ భార్యాభర్తలు. ఒక రోజు ఇద్దరు కలిసి ఒక పార్టీకి వెళ్ళారు. అమల ది స్వతహాగా కలుపుగోలు స్వభావం. ఎంత కొత్త వాళ్ళతో నైనా ఇట్టే పరిచయం కలుపుకుని చనువుగా మాట్లాడేయడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. అందులోనూ కో ఎడ్యుకేషన్ లో చదివిందేమో ఆమెకు మగ వాళ్ళయినా ఒకటే ఆడవాళ్ళయినా ఒకటే. అయితే విజయ్ ది పూర్తిగా విరుద్ధ స్వభావం. ఎవరైనా పలకరిస్తేనే పలికే రకం. పార్టీలో అమల తనకంటే అందమైన అపరిచిత యువకుడితో నవ్వుతూ, తుళ్ళుతూ గల గల మాట్లాడేస్తూంటే విజయ్ పక్కనే మౌనంగా నుంచున్నాడు. మీరే విజయ్ అయితే ఆ అపరిచిత యువకుడి పట్ల మీ భావాలు ఎలా వుంటాయి?

2. శ్రీనివాస్ది చూపులను ఆకట్టుకునే అందం. భార్య సీతతో కలిసి ఆ ఇంట్లో అద్దెకు దిగి రెండురోజులే అయింది. అయితేనేం ఈ రెండు రోజులలోనే భార్య ప్రమేయం లేకుండానే ఆ చుట్టు పక్కల ఆడవాళ్లతో కలుపుగోలుగామాట్లాడే చనువుఏర్పరచుకున్నాడు. భార్య ఎదురుగా వున్నా సరే వాళ్ళతో మాట్లాడటం, జోకులేసి వాళ్ళను నవ్వించడం, అప్పుడప్పుడు వాళ్ల వేపు కోరిక నిండిన కనులతో చూడటం మొదలు పెట్టాడు. మరి మీరే శ్రీనివాస్ భార్య అయితే అలాంటి పరిస్థితులలో ఎలా ఫీలవుతారు.

3. ఒక రోజు నీలిమ అనుకోకుండా బీరువా సర్దుతుంటే అడుగు అరలో కాగితం కింద రహస్యంగా దాచిన కొన్ని ఉత్తరాలు కంట బడ్డాయామెకు. ఆసక్తితో వాటిని విప్పి చదివిన నీలిమకు మతి పోయినంత పనయింది. అవి తన భర్తకి ఎవరో రాసిన ప్రేమ లేఖలు. భర్త రాగానే వాటి విషయం అడిగితే, "అవి గతానికి చెందిన తీపి జ్ఞాపకాలు. ఇప్పటికీ నా హృదయంలో ఆమెకు స్థానం వుంది." అన్నాడతను. మీరే నీలిమ స్థానంలో వుంటే ఆ మాటలకి ఎలా స్పందిస్తారు?

4. కాంతిమతితో కాలేజీ లో చదువుకున్న స్నేహితుడు ఒకతను వాళ్ళ వూరు వస్తున్నట్లు ఉత్తరం రాసి ఆమెని చూడడానికి వాళ్ళింటికి వస్తున్నానని తెలిపాడు కాంతిమతి



ఆ లెటర్ భర్తకు చూపించి, అతను అనుమానించకుండా ముందే కాలేజీలో చదువుకునే టప్పుడు అతను తనని ప్రేమించిన సంగతి చెప్పేసింది. మరి మీరే కాంతిమతి భర్తయితే ఏం చేస్తారు?

5. శ్రీధరరావుకు పెళ్ళి కాక ముందునుంచే ఒకామెతో సంబంధం వుంది. పెళ్ళయినా ఆ బంధం తెగలేదు. అయితే ఈ విషయం భార్యకు తెలిసిన తర్వాత మొదటామె దగ్గరకు వెళ్ళడం మానుకున్నాడు. కానీ కొంత కాలం తర్వాత వ్యాపార విషయాల కారణంగా తిరిగి ఆమెతో సంబంధం ఏర్పరచుకోక తప్పలేదనికి. మీరే శ్రీధరరావు భార్యగా వుంటే ఈ విషయం తెలిసిన తర్వాత ఎలా ఫీలవుతారు?

ఇవండీ ప్రశ్నలు! వీటికి సమాధానాలు మీరు రెడి చేసి పెట్టుకున్నతర్వాత మేమిచ్చిన కీ సొల్యూషన్‌ను చదవండి!

కీ సొల్యూషన్

1. భార్య తన ప్రమేయం లేకుండా అపరిచిత యువకుడితో నవ్వుతూ మాట్లాడుతుంటే ఎలాంటి వారికైనా అసూయ జనించడం సహజం! అంతే గాకుండా పార్టీకి వచ్చిన మిగతా వారు తన గురించి, తన భార్య గురించి ఏమన్నా అనుకుంటారేమో నన్న భయం కూడాకలుగుతుంది. అయితేఇలాంటి సందర్భాలలో విజ్ఞత ప్రదర్శించడంలోనే మగవాడి నేర్పు బయటపడుతుంది. కాసేపు సరదాగా మాట్లాడినంత మాత్రాన తప్పేమీ లేదులే! అని సరిపుచ్చుకుంటే అసూయకు అస్కారమే లేదు.

2. తన భర్త అందమైన అమ్మాయిలతో కలుపుగోలుగా మాట్లడుతుంటే ఆ భార్యకు అసూయ కలగదు మరి! కేవలం కబుర్లు, జోకులతోనే సరిపెట్టుకుని ఊరుకుంటే వివాదాలకు తావే లేదు. అయితే తన వెనుక శ్రీవారు పిచ్చి వేషాలు వేయకుండా శ్రీమతి కంటు కనిపెడుతున్నదన్న మాట మాత్రం ఖాయం.

3. తనకి గతంలో వచ్చిన ప్రేమ లేఖల్ని ఇప్పటికీ పదిలంగా దాచుకున్న భర్త మీద భార్యకు అసూయకంటే ముందు కోపం వస్తుంది. దాంతోపాటు భర్త హృదయంలో స్థిర నివాసం ఏర్పచుకున్న ఆ ప్రేయసిపై అసూయ కూడా ఏర్పడుతుంది. అయితే దీని గురించి అనవసరపు గొడవలు సృష్టించుకోవడం అవివేకం. భర్త హృదయంలోంచి ఆ ప్రేయసి రూపాన్ని చేరిపేసి, ఆ స్థానంలో తను చేరడం ఉత్తమ ఇల్లాలి కర్తవ్యం.

4. గతంలో తన భార్య ప్రేమించిన వ్యక్తి మళ్లీ ఇంత కాలానికి ఆమెని చూడడానికి వస్తున్నాడని విని అసూయ పడడం అవివేకం! ఎందుకంటే తెలిసీ తెలియని వయసులో ప్రేమకు అర్థం లేదు. భార్య మనస్తత్వం ఎలాంటిదో తనకు తెలుసుకాబట్టి ఆ వచ్చే వ్యక్తిని నిండు హృదయంతో ఆహ్వానించాలి. అయితే అతను తన భార్యమీద ఇంకా వ్యామోహాన్ని చంపుకోలేక వెకిలి చేష్టలకు దిగితే గుణపాఠం నేర్పించడం మాత్రం మరవద్దు.

5. వ్యాపారం వ్యాపారమే! మిగతా విషయాలతో వాటిని జత చేయకూడదు! అందుకే ఈ విషయంలో అసూయకు పోకుండా భార్య నిర్వర్తించాల్సిన బాధ్యత ఎంతో ఉంది. భర్తకు మెల్లిగా నచ్చచెప్పి ఆమె దగ్గరకు వెళ్లడం మానిపించాలి.

అయిందా! ఇప్పుడు ఈ జవాబులను మీ జవాబులతో సరిపోల్చుకుని మీలో అసూయ ఎంత పాలులో ఉందో తేల్చుకుండి. మరొక విషయం, అసూయ అభివృద్ధికి అడ్డుకట్ట వేస్తుందని మాత్రం మరచిపోకండి.

– యం. రాధిక

వారానికో చిట్కా!

కొత్త ఇంట్లో (అద్దె ఇల్లయినా కావచ్చు) సంసారం ఏర్పరచుకునే ముందు ఏ గదిలో, ఎక్కడెక్కడ, ఏమేమి అమర్చుకోవాలో ముందే ఒక లిస్టు రాసుకుంటే, గందరగోళానికి అవకాశం వుండదు. ఇల్లు ముచ్చటగా అమరిపోతుంది.